సాక్షి
అనకాపల్లి
గురువారం । 8 । జూన్ । 2023



ఘనంగా కలశస్థాపన 8లో

గోదావరం స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో రాజగోపురాల కలశ స్థాపన వైభవంగా జరిగింది. రూ.3 కోట్లతో వాటిని నిర్మించారు.



వేసవికి రంగులద్దేశారు

వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం నిర్వహించిన శిబిరాల్లో శిక్షణ పొందిన చిన్నారులు చిత్రలేఖనంతో అలరించారు. 8లో



ముగిసిన శిక్షణ

విశాఖ: జీవీఎంసీ ఆధ్వర్యంలో 15 రోజులపాటు సాగిన వేసవి శిక్షణ శిబిరాలు ముగిశాయి.

న్యూస్‌రీల్

బాలికా సాధికారతకు పెద్దపీట

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

పరవాడ: బాలికా సాధికారితపై ప్రత్యేక దృష్టి సారించి వ్యక్తిత్వ వికాసాన్ని ప్రోత్సహించడానికి సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి అమోఘమని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అభినందించారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో నిర్వహిస్తున్న బాలిక సాధికారత మిషన్ వర్క్‌షాప్–2023ను కలెక్టరు బుధవారం సందర్శించారు. బాలికలతో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి బాటలు వేసుకోవడంతో పాటు జీవితంలో విజయాలే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బాలికలకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, చీఫ్ జనరల్ మేనేజర్ గోవిందరాజన్, హెచ్ఆర్ హెడ్ రుమాడీశర్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్కూళ్లు తెరిచే రోజే జేవీకే కిట్లు

- జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ



జేవీకే కిట్లను పరిశీలిస్తున్న డీఈవో

నక్కపల్లి : పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ తెలిపారు. బుధవారం ఆమె నక్కపల్లి మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ భద్రపరచిన జేవీకే కిట్లను పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి కిట్లను ఆయా పాఠశాలలకు చేర్చి, తొలి రోజే విద్యార్థులకు పంపిణీ చేయాలని ఎంఈవో ప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం భవిత కేంద్రాన్ని పరిశీలించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులకు, నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా ఎస్ఎస్ఏ అధికారులను సూచించారు. నాడు–నేడు కింద పాఠశాలల్లో జరుగుతున్న రెండో దశ పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హెచ్ఎంలను, ఎంఈవోలను ఆదేశించారు.

గంటందొరకు ఘన నివాళి



గంటందొర సమాధి వద్ద పుస్తకావిష్కరణ చేస్తున్న వీరభద్రరావు

గొలుగొండ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ప్రధాన అనుచరుడు గంటందొర 99వ వర్ధంతి కార్యక్రమం కృష్ణదేవిపేటలోని అల్లూరి పార్కులో బుధవారం నిర్వహించారు. గంటందొర, అల్లూరి సమాధులకు అల్లూరి సీతారామరాజు సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గంటందొర జీవిత విశేషాలపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మన్యం పోరాటంలో గంటందొర ప్రథమ అనుచరుడని తెలిపారు. గంటందొర కుటుంబ సభ్యుల మధ్య అయన వర్ధంతి నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యనారాయణ, వరలక్ష్మి, పంచాడ రమణ, అంబటి వరహాలతో పాటు గంటందొర అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు రైలు ప్రమాద బాధితుల డిశ్చార్జ్

- కేజీహెచ్‌లో ఒకరికి కొనసాగుతున్న చికిత్స

మహారాణిపేట: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఇద్దరు బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ నెల 4న కేజీహెచ్‌లో ముగ్గురిని చేర్పించిన సంగతి తెలిసిందే. ఐసోలేషన్ వార్డులో ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఎ.శంకరరావు ఆరోగ్యం స్థిరంగా ఉందని సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు. బుచ్చిరాజుపాలెం ప్రాంతానికి చెందిన మాధవరావు, భారతి పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశామన్నారు. ఇటీవల మంత్రి అమర్‌నాథ్.. శంకరరావుకు రూ.లక్ష, మాధవరావు, భారతీలకు రూ.25వేల చొప్పున ప్రభుత్వ సాయం అందించారు.

ఎండలు.. మంటలు



రాంబిల్లిలో దగ్ధమవుతున్న తుక్కు కేంద్రం(ఫైల్)



అనకాపల్లి మండలం మర్రిపాలెంలో అగ్నికి ఆహుతి అయిన యోగా కేంద్రం

వేసవి చివరి దశకు చేరుకుంది. అయినా ఎండలు మండుతున్నాయి. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అనేక చోట్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. సాధారణ రోజుల కంటే వేసవిలోనే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అస్కారం ఉంటుంది. వీటిని అప్రమత్తతతో నివారించవచ్చని అధికారులు చెప్తున్నారు.

- మరో వారం రోజులు అధిక ఉష్ణోగ్రతలు
- అగ్నిప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు
- ఈ వేసవిలో రూ.1.27 కోట్ల మేర ఆస్తి దగ్ధం

తుమ్మపాల : ఈ ఏడాది వేసవి మొదలు, రోజురోజుకు ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. ప్రతి రోజు 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకు వడగాడ్పులు తోడవడంతో పలు చోట్ల అగ్ని ప్రమాదాలు నెలకొంటున్నాయి. పరిశ్రమలు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, వ్యాపార కూడళ్లు, పంటలు, కమ్మల పాకలతో పాటు, ఇళ్లలోనూ తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ఈ వేసవిలో రూ.1.27 కోట్ల ఆస్తి నష్టం

జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో 90కి పైగా అగ్నిప్రమాదాలు జరిగాయి. సుమారు రూ.1.27 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, మంటల్ని ఆర్పి, రూ.4.72 కోట్ల మేర ఆస్తుల్ని సంరక్షించారు. జిల్లాలో రెండు చోట్ల రూ.10 లక్షలపైన ఆస్తినష్టం వాటిల్లిన ప్రమాదాలు సంభవించాయి. హైరిస్క్ కేటగిరీ ప్రమాదాల్లో ఏడింటిని సిబ్బంది చాకచక్యంగా నివారించగలిగారు. రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య విలువున్న ఆస్తిని ఒక ప్రమాదంలోను, 83 సాధారణ ప్రమాదాలను అగ్నిమాపక సిబ్బంది నియంత్రించారు.

ముందు జాగ్రత్త తప్పనిసరి

ఇప్పుడు ప్రతి పనికి విద్యుత్ వినియోగం తప్పనిసరి. ఇళ్లల్లో వంటల నుంచి వ్యవసాయం, వ్యాపారం, పారిశ్రామిక వాడల్లో ఉత్పత్తుల వరకు అన్నింటికీ విద్యుతే ప్రధాన ఆధారం. దీంతో వేసవి ఎండల దృష్ట్యా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, గ్యాస్ సిలిండర్లు వినియోగించే వారు అప్రమత్తంగా ఉండాలి. ఒకే ప్లగ్ పాయింట్ నుంచి ఎక్కువ గృహోపకరణాలకు విద్యుత్ సరఫరా చేయకుండా చూసుకోవాలి. మరమ్మతుకు గురైన విద్యుత్ పరికరాలను సొంతంగా రిపేర్లు చేయకుండా, నిపుణుల్ని ఆశ్రయించడం మేలు. గ్రైండర్లు, ఏసీ, ఫ్రిడ్జ్ వంటి పరికరాల్లో అసాధారణ శబ్దాలు వస్తే అశ్రద్ధ చేయకుండా మెకానిక్ వద్దకు తీసుకెళ్లాలి.

రైతులకు ప్రత్యేక సూచనలు

- పంట పొలాల్లో ఎండా కాలంలో ఎలాంటి మంటలు వేయొద్దు. ఒక వేళ పొలాల్లో చెత్తను తొలగించేందుకు మంట వేయాలనుకుంటే తెల్లవారు జామునే వేయాలి. పూర్తిగా దగ్ధమయ్యేంత వరకు దగ్గరే ఉండి, నీళ్లు చల్లి మంటల్ని ఆర్పివేయాలి.
- వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించిన మోటారు స్టార్టర్లు, స్విచ్‌లున్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ చేయాలి.
- కాటన్ మిల్లుల్లో ప్యానల్ బోర్డులు, మోటార్లలోనికి కాటన్ డస్ట్ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- లూజ్ కనెక్షన్లు, వైరింగ్ సమస్యల్ని ముందుగానే పరిష్కరించాలి.
- అన్ని స్విచ్ బోర్డులు, ప్యానెల్ బోర్డులు ముందు రబ్బరు మాట్లు విధిగా ఏర్పాటుచేయాలి. చెక్క మీద స్విచ్ బోర్డులుంటే ఇండస్ట్రియల్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటుచేయాలి.
- వాహనాల్లో ప్రయణించే సమయాల్లో ట్రాక్టర్‌కు ఎండు గడ్డి చుట్టుకోకుండా చూసుకోవాలి. అలా చుట్టుకుంటే ట్రాక్టర్ వేడికి గడ్డి నుంచి మంట లొచ్చే ప్రమాదం ఉంది.
- రేడియేటర్లో తగినంత నీరు ఉన్నదీ, లేనిదీ తరచూ పరిశీలించాలి.
- వాహనాలపై ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు జారిపడినా, వాటికి వాహనం తగిలినా, వాహనంలో నుంచి బయటకు పడేందుకు హోపింగ్(గెంతుట, దూకుట) విధానాన్ని అనుసరించాలి.

నిమిషాల్లో స్పందన



ఫైర్ నెంబర్ 101కు కాల్ చేస్తే చాలు, నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకుంటున్నాం. మా సిబ్బంది నిమిషానికి రెండు కిలోమీటర్ల వేగంతో చేరుకుని ప్రమాదాన్ని నివారిస్తారు. జూన్ 14 వరకు 46 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరగవచ్చని వాతావరణ నిపుణుల హెచ్చరికలున్నాయి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయట తిరగొద్దు. ముఖ్యంగా రైతాంగం అప్రమత్తంగా ఉండాలి.

– ఆర్.వెంకటరమణ, జిల్లా అధికారి, విపత్తు, అగ్నిమాపక శాఖ

అనకాపల్లికి ఆరో స్థానం

- వైఎస్సార్ కంటి వెలుగు సేవలకు గుర్తింపు
- అవ్వా తాతల కళ్లల్లో వెలుగులు



వృద్ధులకు కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నక్కపల్లి: వైఎస్సార్ కంటి వెలుగు పథకం అమలులో అనకాపల్లి జిల్లాకు రాష్ట్రంలో ఆరో స్థానం లభించింది. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేక మసకబారిన చూపుతో కాలం వెళ్లదీస్తున్న అవ్వాతాతలకు, సరైన పోషకాహారం లేక, చిన్నతనంలోనే దృష్టిలోపాలతో బాధపడుతున్న చిన్నారులకు వైఎస్సార్ కంటి వెలుగు ఒక వరంగా నిలిచింది. ఈ పథకం ద్వారా పాఠశాలలకు నేరుగా వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు వచ్చి దృష్టి లోపాలతో బాధపడేవారిని గుర్తించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. కళ్లద్దాలు పంపిణీ చేసి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా లక్షలాది మంది అవ్వాతాతలు, పాఠశాల విద్యార్థుల కళ్లల్లో కొత్త వెలుగులు విరబూస్తున్నాయి. 2019 అక్టోబరు 10న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొదటి, రెండు విడతల్లో పాఠశాల విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. మూడో విడతలో వృద్ధులపై దృష్టి పెట్టారు. జిల్లాలో జూన్ 5వ తేదీ వరకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అందించిన సేవలకు గాను ఆరో స్థానం లభించినట్టు అధికారులు తెలిపారు.

నిరంతరం వైద్యపరీక్షలు

ప్రతిరోజు మండల కేంద్రాల్లో ఉన్న సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరికరాల ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే పీహెచ్‌సీల్లో పనిచేసే ఆప్తాలమిక్ అసిస్టెంట్లు గ్రామాల్లోకి వెళ్లి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి దృష్టి లోపంతో ఉన్న వారిని గుర్తిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు.

ఫేజ్ 3లో అవ్వా తాతలకు....

2020 ఫిబ్రవరి 18న ప్రారంభమైన ఫేజ్ 3లో 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలకు 'కంటి వెలుగు'

	అర్హులు	సేవలు అందుకున్నవారు
వైద్య పరీక్షలు	2,19,993	1,54,572
కళ్లద్దాలు	49,222	40,388
శస్త్రచికిత్సలు	8665	5275

సేవలకు గుర్తింపు



వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో అందిస్తున్న సేవలకు గాను అనకాపల్లి జిల్లాకు రాష్ట్రంలో ఆరో స్థానం లభించింది. ప్రతి గ్రామంలో ముమ్మరంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం నడుస్తున్న ఫేజ్ 3లో ఇంతవరకు 71శాతం మందికి కంటి పరీక్షలు, 82 శాతం మందికి కళ్లద్దాలు, 61 శాతం మందికి శస్త్రచికిత్సలు పూర్తి చేశాం.

–డాక్టర్ రమణకుమార్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (వైఎస్సార్ కంటి వెలుగు పథకం)

కనకమహాలక్ష్మి సన్నిధిలో...



జస్టిస్ చక్రవర్తి దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): కనకమహాలక్ష్మిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జస్టిస్ బీవీఎస్ఎల్ చక్రవర్తి దంపతులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, బీసీ రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. వేద ఆశీర్వచనం అనంతరం ప్రముఖులకు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

సాగి రామభద్రరాజు కన్నుమూత





రామభద్రరాజు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు బాబూరావు, ఉమాశంకర్ గణేష్



రామభద్రరాజు (ఫైల్)

కోటవురట్ల: తంగేడు రాజవంశంలో మరో శకం ముగిసింది. దాదాపు 30 ఏళ్లపాటు ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ చైర్మన్‌గా సేవలందించిన రాజా సాగి రామభద్రరాజు (76) బుధవారం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంతో ఆయన సత్సంబంధాలు ఉన్నాయి. వైఎస్సార్ ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు పలుమార్లు తంగేడులో బస చేసి తన అభిమానాన్ని, అనుబంధాన్ని చాటేవారు. ఆరంభం నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న రామభద్రరాజు వైఎస్సార్ మరణం తర్వాత వైఎస్సార్‌సీపీలో కొనసాగారు. వరుసకు మేనల్లుడైన మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజుకు మార్గదర్శిగా నిలిచారు. ఆయన మృతితో జిల్లా అంతటా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన పార్థివ దేహానికి తంగేడు రాజా కుటుంబీకులతోపాటు ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

నేడు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

- నర్సీపట్నంలో ఎన్నికకు ఏర్పాట్లు



బోడపాటి సుబ్బలక్ష్మి



కోనేటి రామకృష్ణ

నర్సీపట్నం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులకు గురువారం ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మే 30న వెలువడిన ఎన్నికల నోటిఫికేషన్‌ను అనుసరించి ఈ నెల 8న జరిగే ఎన్నికకు హాజరు కావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఉదయం 10 గంటలకు చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నిక జరుగుతుందని అధికారులు తెలిపారు. ఏప్రిల్‌లో చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి రాజీనామా చేయడంతో రెండు పదవులకు ఖాళీ ఏర్పడింది. కౌన్సిలర్లు చేతులు పైకెత్తడం ద్వారా చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లను ఎన్నుకుంటారు. చైర్‌పర్సన్ పదవీ ఎస్సీ మహిళకు రిజర్వు చేసిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీకి చెందిన బోడపాటి సుబ్బలక్ష్మి చైర్‌పర్సన్‌గా, కోనేటి రామకృష్ణ వైస్‌చైర్మన్‌గా ఎన్నిక కానున్నారు.

రైలు నుంచి జారిపడి ముగ్గురికి గాయాలు



అనకాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో సంఘటన స్థలంలో శంకరరావు, అన్నపూర్ణ, దాక్షాయణి

అనకాపల్లి టౌన్: అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో జన్మభూమి సూపర్‌ఫాస్ట్ రైలు నుంచి ముగ్గురు ప్రయాణికులు జారీ పడి గాయాలపాలయ్యారు. స్థానికులు, రైల్వే పోలీసులు అందించిన వివరాలు.. అనకాపల్లి మండలం మూలపేట గ్రామానికి చెందిన ఎ.శంకరరావు, కరణం అన్నపూర్ణ తాడేపల్లిగూడెం వెళ్లేందుకు బుధవారం అనకాపల్లిలో రైలు ఎక్కారు. విశాఖ నుంచి అదే రైలులో వస్తున్న వారి బంధువు జనపరెడ్డి దాక్షాయణి అనకాపల్లిలో రైలు దిగి వారితో పాటు ఎక్కారు. జనరల్ బోగీలో తీవ్రమైన రద్దీ ఉండడంతో ప్రయాణికులు వేలాడుతున్నారు. అలా వేలాడుతూ శంకరరావు కదులుతున్న రైలు నుంచి జారిపడిపోయారు. ఆయనతోపాటు దాక్షాయణి, అన్నపూర్ణ కూడా జారిపడ్డారు. శంకరరావు రైలు చక్రం కిందకు పడిపోవడంతో కూడి కాలు విరిగిపోయింది. మిగతా ఇద్దరూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ముగ్గురినీ హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా.. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆనందహేల

- క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదం
- జిల్లాలో 400 మందికి మేలు
- తమ జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారని భావోద్వేగం



హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

సాక్షి, విశాఖపట్నం: ప్రజా సంకల్పయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆవేదన విన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. మాట నిలబెట్టుకొని కాంట్రాక్ట్ ఉద్యోగుల 23 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ.. వారికి తీపికబురు అందించారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు సంబరాల్లో మునిగితేలారు. ఇచ్చిన మాటకు కట్టుబడి.. తమ జీవితాల్లో ఆనందం నింపారని భావోద్వేగానికి గురయ్యారు. జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని చెప్పారు. అలాగే జిల్లా కేంద్రాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ 12 శాతం నుంచి 16 శాతానికి పెంచడంతో పాటు సీపీఎస్ స్థానంలో గ్యారెంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్) బిల్లు ముసాయిదాను ఆమోదించారు. ఈ నిర్ణయాలపై కాంట్రాక్ట్, ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు కేసు పేరిట టీడీపీ ప్రభుత్వం తప్పించుకుంది

2014 ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చంద్రబాబు దొంగ హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి రాగానే ముఖం చాటేశారు. టీడీపీ ప్రభుత్వం న్యాయస్థానంలో కేసుల పేరిట కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేసింది. ఈ విషయాన్ని పలుమార్లు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు దృష్టికి కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు తీసుకెళ్లినా.. ఏ మాత్రం ప్రయోజనం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలుచోట్ల వీరు కలిసి తమ గోడును వినిపించారు. దీనికి స్పందించిన ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకుని ఆ హామీని నెరవేర్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే తమకు న్యాయం జరిగిందని ఉమ్మడి విశాఖ జిల్లా కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ల ప్రతినిధులు కొనియాడుతున్నారు. ఎప్పటినుంచో పనిచేస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడం చాలా సంతోషంగా ఉందని, ముఖ్యమంత్రి సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తుండగా.. వీరిలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 400 మంది ఉన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్



కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నాం. ప్రజా సంకల్పయాత్రలో మా గోడును ఆయన దృష్టికి తీసుకెళ్లాం. ఆయన ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. టీడీపీ హయాంలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. న్యాయస్థానంలో కేసును బూచిగా చూపించి టీడీపీ ప్రభుత్వం తప్పించుకుంది.

– వైఎస్ చలం, కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు

పీఆర్‌సీతో 16 లక్షల మందికి లబ్ధి



ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుకుంటూ వస్తోంది. డీఏ, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ కూడా విడుదల చేసింది. 23 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల కల నెరవేరింది. కొత్త జిల్లాల్లో హెచ్ఆర్ఏ 12 శాతం ఉంది. దీన్ని 16 శాతం పెంచడం సంతోషంగా ఉంది. ఉద్యోగులు అడిగిన వెంటనే ఆమోదించారు. సీపీఎస్ రద్దు చేశారు. 12వ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పీఆర్‌సీ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు.

– కె.ఈశ్వరరావు, ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రెసిడెంట్

కల నెరవేరింది



పీఆర్‌సీ కమిటీ వేస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ నిర్ణయం. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చరిత్రాత్మకం. ఇన్నాళ్లకు వారి కల నెరవేరింది. మిగిలిన వారికి కూడా దశల వారీగా రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం.

– డి గోపినాథ్, పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రెసిడెంట్

ఉద్యోగ భీమా



ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న మాకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ భీమా కల్పించారు. గవరవరం పీహెచ్‌సీలో 18 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నా. గత ప్రభుత్వాలు కల్లబొల్లి మాటలతో కాలం వెళ్లదీశాయి. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నవారికి రెగ్యులర్ చేయడం అభినందనీయం.

–సిద్దాబత్తుల నాని, కాంట్రాక్టు ఉద్యోగి, అనకాపల్లి

సంస్కరణలు బాగున్నాయి



వయస్సు తక్కువైనా.. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు చాలా హర్షించదగినవి. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటర్ విద్య వరకు పేద విద్యార్థులను ఎలా తీర్చిదిద్దాలనే తపన పడుతున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగుల పక్షపాతిగా సంస్కరణలు చేపట్టి ముందుకు వెళుతున్నారు.

– గాదె శ్రీనివాసులనాయుడు, మాజీ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

ఆకట్టుకుంటున్న ప్రవచనాలు



స్వామి సిద్ధేశ్వరానంద

విశాఖ: లలితా పీఠంలో దశ మహావిద్యలపై ప్రవచనాలు నాలుగు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేస్తున్న ప్రవచనాలు భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో పరవశింపజేస్తున్నాయి. దశ మహావిద్యల ప్రవచనాల్లో భాగంగా బుధవారం కాళీ మాత ఆవిర్భావంపై స్వామీజీ చేసిన విశేష ప్రసంగం సభికులను ఆకట్టుకుంది. కాళీ పూజలో కొన్ని ప్రాంతాల్లో ఉన్న వామాచార సంప్రదాయాన్ని వివరించారు.

క్లుప్తంగా

నర్సీపట్నంలో జాబ్‌మేళా రేపు

- పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే గణేష్



జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేళాకు సంబంధించిన గోడపత్రికను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కూటీ దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న స్కూటీ

యలమంచిలి: మరమ్మతుల కోసం వెల్డింగ్ చేస్తున్న సమయంలో మంటలు వ్యాపించి ఓ స్కూటీ దగ్ధమైంది.అగ్నిమాపకశాఖాధికారి డి.రాంబాబు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక పాత జాతీయ రహదారిలో గల వెల్డింగ్ షాపులో బుధవారం సాయంత్రం స్కూటీకి వెల్డింగ్ చేస్తుండగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈప్రమాదంలో రూ.లక్ష విలువచేసే స్కూటీ దగ్ధమైనట్టు వారు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

‘వేసవి’కి రంగులద్దేశారు

- చిత్రలేఖనంలో చిన్నారులకు తర్ఫీదు
- చోడవరంలో ఏటా ఉచిత శిక్షణ శిబిరం

చోడవరం రూరల్: వేసవి సెలవులనూ వృథాగా పోనీయలేదు ఆ చిన్నారులు. కాలాన్ని కరగదీసేయకుండా కుంచెలకు పని చెప్పారు. వారి మేధను రంగరించి వేసవికే రంగులద్దేశారు. సుమారు 50 మంది వరకు పిల్లలు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని చిత్రలేఖనంలో మెలకువలను నేర్చుకున్నారు. వీరికి విశ్రాంత చిత్రలేఖనం ఉపాధ్యాయుడు బొడ్డేడ సూర్యనారాయణ చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈయన ఏటా మాదిరిగానే ఈ ఏడాది వేసవి సెలవుల్లో గత నెల ఒకటి నుంచి శిక్షణ శిబిరం ప్రారంభించారు. చోడవరం పట్టణ పరిధిలోని పిల్లలు హాజరయ్యారు. అక్షరమాలను దిద్దడమే కష్టమనుకునే వయసులో కుంచెలను రంగుల్లో ముంచి పలు చిత్రాలను గీయడంలో ప్రతిభ చూపారు.

ఇది వారి వయసు రీత్యా ముమ్మాటికీ అభినందనీయమే. వివిధ వయసుల వారందరినీ ఒకచోట చేర్చి నిలకడగా ఉంచడమే గగనం కాగా, వారిని శిక్షణలో కూర్చుండబెట్టిన తీరు, చిత్రలేఖనంలో కళాకారులుగా తీర్చిదిద్దిన వైనం ప్రశంసార్హమే.

మరికొద్ది రోజుల్లో శిక్షణా శిబిరం ముగించనున్న సందర్భంగా సాక్షితో చిన్నారులు తమ భావాలను పంచుకున్నారు.

మాస్టారి శిక్షణ మాకెంతో నచ్చింది..



చిత్రలేఖనం పట్ల ఆసక్తితో ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో చేరాం. మాస్టారు మాకు ఎన్నో మెలకువలు నేర్పారు. కలర్ మిక్సింగ్‌లోను, పెన్సిల్ షేడింగ్‌లోను చెప్పిన అంశాలు మాకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఆయన శిక్షణ మాకు నచ్చింది.

– వై.భావ్యిత, 6వ తరగతి, వి.షాలిని, 9వ తరగతి

రంగులేయడం బాగుంది....



సెలవుల్లో చిత్రలేఖనం నేర్చుకోవడం సరదాగా ఉంది. పాఠ్యపుస్తకాల్లో చూసిన బొమ్మలను మేము పెన్సిల్‌తో గీయడయే గాకుండా రంగులు వేయడం బాగుంది. మాకు కొంతమేరకు చిత్రలేఖనంపై అవగాహన వచ్చింది.

– వై.అక్షజ్, 6వ తరగతి, బి.స్వజిత్, 6వ తరగతి

నైపుణ్యం పొందాలని ఉంది..



వేసవి శిక్షణలో మాకు చిత్రలేఖనంపై ఆసక్తి పెరిగింది. మామూలు రోజుల్లోనూ మాస్టారు వద్ద చిత్రలేఖనం నేర్చుకోవాలని ఉంది. మేం వేసిన బొమ్మలు ఎలా ఉన్నా, వాటికి రంగులు వేయడంతో మంచిగా వచ్చాయి. మరింత నైపుణ్యంతో వేస్తే ఇంకా బాగుంటాయని అనిపించింది.

– వి.ధరణి, పి.భువనేశ్వరి 6వ తరగతి, ఎం.పూర్ణిమ, 7వ తరగతి, ఎం.పద్మ, 6వ తరగతి

థ్యాంక్యూ మాస్టార్....



మాకు చిత్రలేఖనం నేర్పించిన మాస్టారుకు థ్యాంక్స్. చిన్న చిన్న బొమ్మలు వేయడం బాగుంది. మా బొమ్మలు మీకూ నచ్చుతాయి. సెలవుల్లో బొమ్మలేయడం నచ్చింది. మా పేరెంట్స్ మా బొమ్మల్ని ఇష్టపడ్డారు.

– ఓ.వాణిశ్రీయాదవ్, ఓ.వర్షిణీయాదవ్, వి.మురళీకృష్ణ, జి.షెర్విజయ్, టి.జోష్న, టి.ఉదయ్

ఘనంగా ముగిసిన కలశ స్థాపన మహోత్సవాలు



ఊరేగింపుగా పసిడి కలశాలను తీసుకువస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



పసిడి కలశాల ప్రతిష్ఠతో సర్వాంగసుందరంగా కనిపిస్తున్న ఆలయ నూతన రాజగోపురాలు

- చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర ఆలయానికి రాజగోపురాల శోభ

చోడవరం: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవమైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయ రాజగోపురాల కలశ స్థాపన మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. కాణిపాకం తర్వాత అంతటి విశిష్టత కలిగిన స్వయంభూ విఘ్నేశ్వరాలయాల్లో రెండో పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న ఇక్కడి ఆలయానికి రూ.3 కోట్లతో తూర్పు, పశ్చిమ రాజగోపురాలు నిర్మించారు. ఈ గోపురాల ముఖద్వారాలతోపాటు శిఖర కలశ స్థాపన మహోత్సవాలు ఈ నెల 4న ప్రారంభమైన విషయం తెలిసిందే. ముగింపు రోజున రాజగోపురాలకు పసిడి కలశాలను స్థాపించారు. ఒక్కొక్క గోపురంపైనా అయిదేసి కలశాలను స్థాపించారు. ఇక్కడ యాగశాల నుంచి వాటిని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ చేసి, రాజగోపురాల వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దంపతులతోపాటు దేవదాయ శాఖ అధికారులు పసిడి కలశాలను శిరస్సున పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. గోపురాలకు ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చపతిరావు ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, కలశాలను ధర్మశ్రీ స్థాపించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కలశ ప్రతిష్ఠాపనను కనులారా వీక్షించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టు బోర్డు చైర్మన్ నున్న నాగేశ్వరరావు, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

తగరపువలస(భీమిలి): భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేటలో బుధవారం మధ్యాహ్నం డెక్కతి ధనలక్ష్మి(24) అనే వివాహిత కన్నవారింట్లో ఆత్మహత్య చేసుకుంది. వెంటనే ఆమె కుటుంబ సభ్యులు సంగివలస ఎన్ఆర్ఐ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతె ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసును సీఐ కె.లక్ష్మణమూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

ఇదిలా ఉండగా.. మృతురాలికి ఏడాది క్రితం విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడకు చెందిన ముఠా కార్మికుడు కనక గోవిందరెడ్డితో వివాహమైంది. 20 రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఆమె మృతితో జీరుపేట, గుడివాడలో విషాదఛాయలు అలముకున్నాయి.

వడదెబ్బతో వ్యక్తి మృతి



రాజు మృతదేహం

కొయ్యూరు: మూలపేట పంచాయతీ మర్రిపాలెం సమీపంలో వడదెబ్బకు గురై రాజు (48)అనే వ్యక్తి బుధవారం మృతిచెందినట్టు కొయ్యూరు సీఐ స్వామినాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. అనపర్తి ప్రాంతానికి చెందిన వాడుగా చెబుతున్న రాజు నర్సీపట్నంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెత్త ఏరుకుని జీవిస్తున్నాడు. మర్రిపాలెం ప్రాంతానికి వచ్చిన రాజు వడదెబ్బకు గురైనట్టు సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే వెంటనే 9440904218 (సీఐ), 9440904241 (ఎస్ఐ), 9440904217 (మంప ఎస్ఐ) అనే ఫోన్ నంబర్లకు తెలియజేయాలని సీఐ కోరారు.

‘డైట్’కు ఉత్తమ ర్యాంకు



ర్యాంకింగ్ బ్యాండ్ సర్టిఫికెట్‌ను చూపిస్తున్న కళాశాల చైర్‌పర్సన్ దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్: నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేం వర్కు(ఎన్ఐఆర్ఎఫ్)లో స్థానిక డైట్ కళాశాలకు 151 నుంచి 300 ర్యాంకింగ్ బ్యాండ్‌లో స్థానం లభించిందని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 5,543 ఇంజినీరింగ్ కళాశాలలు పాల్గొనగా, కళాశాలలో అనుసరించే బోధన విధానాలు, పరిశోధనల ఆధారంగా కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి రాజ్ కుమార్ రంజన్‌సింగ్ ఈ ర్యాంక్ ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చల్లా సింహాచలం, అధ్యాపకురాలు ఎ.నళిని పాల్గొన్నారు.

చదువుపై అయిష్టతతో విద్యార్థి ఆత్మహత్య



దుర్గారావు మృతదేహం

యలమంచిలి: చదవుపై అయిష్టతతో ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలు ప్రకారం యలమంచిలి మండలం రుక్మిణీపురం గ్రామానికి చెందిన సత్తిబాబు విజయవాడ రైల్వేస్టేషన్‌లో కూలీగా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే నివాసముంటున్నాడు. కుమారుడు కాళ్ల దుర్గారావు (19)ను ఇటీవల విజయవాడలోని ఓ కాలేజీలో డిగ్రీలో చేర్పించారు. డిగ్రీ చదవడం దుర్గారావుకు ఇష్టం లేకపోవడంతో తల్లిదండ్రులతో ఘర్షణపడి మంగళవారం యలమంచిలి మండలం రుక్మిణీపురంలో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఆ సమయంలో ఇంటికి వచ్చిన దుర్గారావు అమ్మమ్మ తాతయ్య చూసి కొనఊపిరితో ఉన్న అతనిని అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్టు తండ్రి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బీచ్ రోడ్డు(విశాఖ తూర్పు): రామ్‌నగర్ కేర్ ఆస్పత్రి ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి ఎటువంటి చలనం లేకుండా ఫుట్‌పాత్‌పై పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆయనను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడిని గుర్తిస్తే మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ రామారావు కోరారు.

డీఎస్సీ-98 ఉపాధ్యాయ సంఘం లీగల్ అడ్వైజరీగా రమణమూర్తి



రమణమూర్తిని అభినందిస్తున్న ఉపాధ్యాయ సంఘం సభ్యులు

మాడుగుల రూరల్: డీఎస్సీ- 98 ఉపాధ్యాయ సంఘం లీగల్ అడ్వైజరీగా పి.వి.రమణమూర్తి(దాసు) నియమితులయ్యారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన డీఎస్సీ-98 సభ్యుల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను రమణమూర్తితో సహా డీఎస్సీ-98 సభ్యులు కలిశారు.

వరదల గుర్తింపు ఉపకరణానికి పేటెంట్



రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌కు ధ్రువపత్రం అందిస్తున్న ఆచార్య జగదీశ్వరరావు, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధకులు, ఆచార్యులకు నూతన పేటెంట్ మంజూరైంది. వరదలను ముందస్తుగా గుర్తించి, ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడానికి ఉపయుక్తంగా నిలిచే »మల్టీ ఫంక్షనల్, కాస్ట్ ఎఫెక్టివ్ స్మార్ట్ పోల్ ఫర్ ఎర్లీ ఫ్లడ్ డిటెక్షన్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్«ఉపకరణానికి భారత ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. ఏయూ పరిశోధకులు డాక్టర్ రాజేష్ దువ్వూరు, జియో ఇంజినీరింగ్ ఆచార్యులు పి.జగదీశ్వరరావు సంయుక్తంగా దీనిని తీర్చిదిద్దారు. వరదలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాలలో ముందస్తుగా స్మార్ట్ పోల్‌ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలకు చేరవేసి సత్వర సేవలు అందించేలా ఈ పరికరాన్ని తీర్చిదిద్దారు. పేటెంట్ మంజూరు చేస్తూ జారీ చేసిన అధికారిక ఉత్తర్వులను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌కు ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం సమక్షంలో ఆచార్య జగదీశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.నరసింహారావు, బి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు కలుషితం కాలేదు

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం
- వాటర్ సప్లై ఏఈ కనకారావు



వాస్తవానికి సరఫరా అయిన నీటి రంగు ఇది



బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయిన లేత పసుపు రంగుతో ఉన్న మంచినీరు

మల్కాపురం(విశాఖ పశ్చిమ): జీవీఎంసీ 61వ వార్డు జాలరివీధి లో బుధవారం ఉదయం సరఫరా చేసిన తాగునీరు కలుషితమైందని సోషల్ మీడియాలో అయిన ప్రచారంలో వాస్తవం లేదని మల్కాపురం వాటర్ సప్లై ఏఈ కనకరావు స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన మండిపడ్డారు. బుధవారం సరఫరా చేసిన తాగునీరు లేత పసుపు రంగు మాదిరిగా ఉందని స్థానిక సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఏఈ కనకరావు సిబ్బందితో కలిసి జాలరివీధికి వెళ్లి సరఫరా అయిన నీటిని పరీక్షించారు. అలాగే నీటి రంగు చూశారు. అయితే ఎప్పటి మాదిరిగానే తాగునీరు శుభ్రంగానే ఉంది.

నీటిలో మినరల్స్ శాతం సక్రమంగానే ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఈ కనకారావు మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న అవాస్తవాలను నమ్మవద్దని కోరారు. మంచినీటి సరఫరాలో ఏమైనా సమస్య ఉంటే కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు.



నీటిని పరీక్షిస్తున్న అధికారి

క్లుప్తంగా

సచివాలయాల్లో మొక్కల పెంపకం

కశింకోట : మండలంలోని సచివాలయాల్లో పర్యావరణ పరిరక్షణకు 1,050 మొక్కలను నాటనున్నట్టు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. 20 సచివాలయాల పరిధిలో నీడను, ఫలసాయాన్నిచ్చే బాదం, మామిడి తదితర మొక్కలను నాటుతున్నామన్నారు. దీంతో కాలుష్య నివారణకు దోహదపడినట్ల వుతుందన్నారు. స్థానిక ప్రజలు కూడా తమ ఇళ్ల ముందు నీడను, స్వచ్ఛమైన గాలినిచ్చే మొక్కల పెంపకానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు.

'మట్టి వినాయకుడినే పూజించాలి'

అనకాపల్లిటౌన్ : ఈ ఏడాది సెప్టెంబర్ 19న జరిగే వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో మట్టి వినాయకులను పూజించి, పర్యావరణ పరిరక్షణకు భక్తులు సహకరించాలని వినాయక నిమజ్జనోత్సవ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఆడారి కుమారస్వామి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో లక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూర్తిగా నిషేధించాలని భక్తులను కోరారు. భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రేబాక మధు, పరదేశినాయుడు, సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కూచిపూడి పోటీలకు జాహ్నవి

అనకాపల్లిటౌన్ : స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మండా జాహ్నవి కూచిపూడి నాట్య పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్ణాటక కేంద్రంగా అంతర్జాతీయ మ్యుజిషియన్స్, డ్యాన్సర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఆన్‌లైన్ ద్వారా ఈ పోటీలు జరుగుతాయన్నారు. సాధారణ కుటుంబంలో పుట్టి, నాట్యంపై మక్కువతో అంచెలంచెలుగా ఎదుగుతున్న జాహ్నవి, ఈ పోటీల్లో గెలుపొందాలని ఆయన ఆకాంక్షించారు.

104 సేవలు సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, వైద్య సిబ్బంది వైద్యసేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
అహింస	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్దిసాయి
చక్రవ్యూహమ్	: వెంకటేశ్వర
నేను స్టూడెంట్ సర్	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 269 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 207 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఉపాధికి ఊతం.. చెరువులు పటిష్టం

మండలంలో సుమారు రూ.కోటితో చెరువుల్లో పూడిక తొలగింపు పనులు శర వేగంగా సాగుతున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలను సైతం లెక్క చేయకుండా చెరువుల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి, లోతు పెంచే పనులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామంలో పనుల్లేని చోట, పొరుగు గ్రామాలకు కూలీలను తరలించి మరీ ఉపాధి కల్పిస్తున్నారు.

- మండలంలో రూ.కోటితో 10 చెరువుల్లో పూడిక తొలగింపు
- పనుల్లేని గ్రామ కూలీలకు పొరుగు గ్రామాల్లో ఉపాధి
- ఉపాధి పనులకు ఆటోల్లో కూలీల తరలింపు



జమాదులపాలెంలో చేపల చెరువు తవ్వకం పనుల్లో ఉపాధి కూలీలు

కశింకోట : జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండల పరిధిలో పది సాగునీరు, చేపల చెరువుల పనులు జరుగుతున్నాయి. రానున్న వర్షాల వల్ల ఆటంకం రాకుండా నెలాఖరులోగా పూడికతీత పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో కూలీలకు వేసవిలో సమృద్ధిగా పని లభిస్తోంది.

లోతు పెంపు.. గట్ల పటిష్టం

మండలంలోని ఉపాధి హామీ పథకంలో పది చెరువుల పూడికతీత పనులను ఏప్రిల్ నెలలో చేపట్టారు. ఒక్కో చెరువుకు రూ.10 లక్షల అంచనా వ్యయంతో పనులు నిర్వహిస్తున్నారు. అడ్డాంలో రెండు చెరువులు, చెరకాం, తీడ, ఇ.చౌడువాడ, సుందరయ్యపేట గ్రామాల్లో ఒక్కొక్క సాగు నీటి చెరువులో పూడిక తీస్తున్నారు. దీంతో ఒక్కో చెరువు ఆయకట్టున ఉన్న సుమారు 50-60 ఎకరాల భూమిలో పంటలు పండించేందుకు రానున్న సీజన్‌లో పుష్కలంగా సాగునీటి వసతి లభించనుంది. బయ్యవరం, జమాదులపాలెం గ్రామాల్లో చేపల పెంపకానికి వినియోగిస్తున్న చెరువులను కూడా పూడిక తొలగించి, లోతు పెంచే పనులు చేపట్టారు. పనులు పూర్తయితే ఈ చెరువుల్లో రూ.లక్షల విలువైన మత్స్యసంపద పెంచేందుకు వెసులుబాటు కలుగనుంది. దీని ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరనుంది. ఇవేకాక చెరువుల నుంచి ఆయకట్టుకు సాగునీరు వెళ్లే కాలువల పునరుద్ధరణ, చెరువుల గట్లు, వరద గట్ల పటిష్టం చేయడం తదితర పనులను కూడా చేపడుతున్నారు. సుందరయ్యపేటలో పొలాలకు వెళ్లే రోడ్డు ధ్వంసం కావడంతో రూ.8 లక్షల వ్యయంతో సుమారు కిలో మీటరు పొడవున మట్టి రోడ్డును పునరుద్ధరిస్తున్నారు. ఇది పూర్తయితే పంట పొలాలు, జీడిమామిడి, మామిడి తోటల్లో పండిన ఉత్పత్తులను తరలించడానికి మార్గం సుగమం కానుంది.



అడ్డాం గ్రామం నుంచి ఉపాధి పనులకు ఆటోలో వెళ్తున్న కూలీలు



సుందరయ్యపేటలో ఉపాధి నిధులతో పొలాల మీదుగా మట్టి రోడ్డు నిర్మాణం

గ్రామీణ కూలీలకు ఉపాధి

మండలంలో జరుగుతున్న ఉపాధి పథకం ద్వారా వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేని గ్రామాలకు చెందిన కూలీలకు కూడా ఉపాధి లభిస్తోంది. ఏనుగుతుని, ఏఎస్ పేట, జెట్టపురెడ్డితుని తదితర గ్రామాలకు చెందిన కూలీలను అడ్డాం, తాళ్లపాలెం తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనుల కోసం ఆటోల్లో తరలిస్తున్నారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా కూలీల ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. కుటుంబానికి వంద రోజులు పని కల్పించే లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో రోజుకి సుమారు 5,900 మంది కూలీలు పని చేస్తున్నట్లు అధికారిక సమాచారం. వీరికి రోజుకి సుమారు రూ.15.77 లక్షల వరకు కూలీగా చెల్లిస్తున్నారు.

పుష్కలంగా పని దినాలు

మండలంలోని జాబ్‌కార్డుదాలందరికీ ఉపాధి పనులు దొరికేలా ఏర్పాట్లు చేశాం. గ్రామాలకు ఉపయోగపడేలా చెరువుల్ని పటిష్టం చేస్తున్నాం. ఉన్న ఊరిలో పనుల్లేని చోట, పొరుగూరికి ఉపాధి కూలీలను తీసుకెళ్లి మరీ పని కల్పిస్తున్నాం. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మంచి నీరు, నీడ, తదితర సదుపాయాలను ఏర్పాటు చేశాం.

–శివ, ఏపీవో, ఉపాధి హామీ పథకం, కశింకోట

హైవేపై వేగ నియంత్రణకు చర్యలు

అనకాపల్లిటౌన్ : స్థానిక జాతీయ రహదారిపై కొత్తూరు నర్సింగరావుపేట వద్ద రోడ్డు మధ్యలో డివైడర్లను జాతీయ రహదారుల సంస్థ, రూరల్ పోలీసులు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ జంక్షన్లో జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం నుంచి జాతీయ రహదారికి వచ్చే మార్గంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో 8 మంది మరణించగా, పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. పరిసర గ్రామ ప్రజలు రోడ్డు దాటే సమయంలో అత్యంత వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలబారిన పడుతున్నారు. వీటి వేగాన్ని నియంత్రించేందుకు తాజాగా కేఎస్ఆర్ పేట వద్ద స్పీడ్ బ్రేకర్లను కూడా ఏర్పాటు చేశారు.



కేఎస్ఆర్ పేట జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

గుంతలమయం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కారిడార్ రహదారి గుంతల మయంగా మారింది. సింహాద్రి ప్లాంట్ నుంచి లంకెలపాలెం వంతెన వరకు 6 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన కారిడార్ రహదారి శిథిలం కావడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కలపాక, పి.బోనంగి, దాసరిపేట, గొల్లపేట, దేశపాత్రునిపాలెం గ్రామాలకు చెందిన ప్రయాణికులతో పాటు ఫార్మాసిటీ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. సింహాద్రి యాష్ పాండ్ నుంచి బూడిదతో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు సైతం గుంతల వల్ల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైకిళ్లపై రాత్రివేళ రాకపోకలు సాగిస్తున్న కార్మికులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. కారిడార్ రహదారి మరమ్మతులు చేపట్టడానికి సింహాద్రి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహన సిబ్బంది కోరుతున్నారు.



గుంతలతో ఎన్టీపీసీ కారిడార్ రహదారి

లారీ నుంచి జారిపడిన బండరాయి

త్రుటిలో తప్పిన ప్రమాదం

మునగపాక: పూడిమడక రోడ్డులో పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని మెలిపాకకు చెందిన మహిళా పోలీసు గంగాభవాని, మరోముగ్గురు అనకాపల్లిలో ఆటో ఎక్కారు. మునగపాక పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు గంగాభవానీ వస్తుండగా, మిగతావారు హరిపాలెం వెళ్లేందుకు బయలుదేరారు. పూడిమడక రోడ్డులో మార్గమధ్యంలో ఆటోకు ముందు రాయిలోడుతో వెళుతున్న లారీ లోంచి ఓ పెద్ద రాయి ఆటో ముందు పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. క్షణం ఆలస్యమైతే రాయి నేరుగా ఆటోమీద పడేదని వారు చెప్పారు. మహిళా పోలీసు గంగాభవాని సంబంధిత లారీని స్టేషన్‌కు తరలించి మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేలా చూడాలని పలువురు కోరారు.



రాళ్లు తరలిస్తున్న లారీ ఇదే



లారీ నుంచి జారిపడిన రాయి

ఇంగ్లిష్‌లో కథలు చెప్పడంపై అవగాహన

అచ్యుతాపురం(అనకాపల్లి): ఇంగ్లిష్‌లో కథలు చెప్పడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం ఈ మేరకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం

రామాలయం నిర్మాణానికి భూమిపూజ

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో రామాలయం నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న భక్తులు →



తెగిపడిన విద్యుత్ వైరు

- తప్పిన ప్రమాదం

మునగపాక: మండలంలోని తోటాడ కాళీమాత ఆలయం వీధిలో బుధవారం ఓ విద్యుత్ వైరు తెగిపడింది. కుళాయి నీరు పడుతున్న మహిళలు గమనించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న లైన్‌మేన్ రాము విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసి, కొత్త వైరు ఏర్పాటు చేశారు.ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డు మీద పడిన విద్యుత్ వైరు

మండుతున్న ఎండలు



నిర్మానుష్యంగా కశింకోట ప్రధాన రహదారి

కశింకోట : మండల ప్రజలు సూర్య తాపంతో బుధవారం సతమతమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రతతోపాటు వడగాడ్పులు వీచాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కశింకోటలోని పంచాయతీ ప్రధాన రహదారులు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం ఆకాశానికి మబ్బులుపట్టి, గాలులు వీయడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



రైలు ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి సీఐటీయూ నాయకులతో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదంలో సుమారు 290 మంది మృత్యువాత పడడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రమాదానికి బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రైవేటీకరణ యోచన విడనాడి, రైల్వేశాఖలో ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కె.వెంకునాయుడు, పోతినాయుడు, రామునాయుడు, అప్పారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

నక్కపల్లి: మండలంలో ఉపమాక శివారు కొండవెనుక పాలెంలో జీసీఎం చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్‌పోటీలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. సంస్థ వ్యవస్థాపకుడు గెద్దాడ ప్రవీణ్ రత్నకుమార్,డైరెక్టర్ ఇందిరా దేవిలు ఈ పోటీలను ప్రారంభించారు. పాయకరావుపేట నియోజకవర్గంనుంచి 22 టీములు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు వారు చెప్పారు ఈ పోటీలను ఆర్గనైజర్లు రాజు, యోహాన్‌ను పర్యవేక్షిస్తున్నారు.

వలంటీర్లకు ఆత్మీయ సత్కారం



సన్మానం పొందిన వలంటీర్లతో ఎంపీపీ జయలక్ష్మి, స్థానిక నాయకులు

మునగపాక : ప్రజలకు మెరుగైన సేవలందించడంలో వలంటీర్ల పాత్ర వెలకట్టలేనిదని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధులుగా పనిచేయాలని, సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఎంపీడీవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29న సీనియర్ సిటిజన్ సంఘ ఎన్నికలు

అనకాపల్లిటౌన్ : సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 29న ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణరావు అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.వి.గౌరీపతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యదర్శి కె.రామచంద్రరావు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో వృద్ధులు ఇబ్బందులు పడకుండా నిపుణులతో మాట్లాడి, పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గంలో నిజాయితీగా వృద్ధుల కోసం పనిచేసే వ్యక్తులను మాత్రమే ఎన్నుకోవాలని కోరారు. అనంతరం అసోసియేషన్ సభ్యుడు నారాయణరావుని శాలువాతో సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంపరాల నారాయణరావు

కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బీఎల్ఎన్ శర్మ, సభ్యులు ఎన్‌బీబీ స్వామి, పి.బాబూరావు, నల్లల దేముళ్లు, విల్లూరి సత్యనారాయణ, మద్దాల కూర్మారావు, కుండల రామకృష్ణ, ఎం.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి మార్కెట్‌యార్డు తూర్పు భాగంలో ప్రహరీగోడ నిర్మాణం, నిర్వహణ నిమిత్తం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ అమరావతి వ్యవసాయ మార్కెట్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లోని 10 గ్రామాల్లో అవసరమైన మేరకు మెటల్ రోడ్డు ఒక్కంటికి రూ.2 లక్షలు చొప్పున రూ.20 లక్షలు వెచ్చించాల్సి ఉందన్నారు. దశల వారీగా మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు బెల్లాన్ని తీసుకువచ్చే రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి డి.శకుంతల, కమిటీ సభ్యులు నీటిపల్లి లక్ష్మి, మర్రిపల్లి శోభ, శ్యామల, నూకరత్నం, అప్పలరాజు, రమేష్‌గుప్తా, విజయకుమారి, మోదిబాబు, కుమార్ వరాహకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలకా యశోద

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

నేడు వ్యవసాయ లైన్ల మరమ్మతులు

కశింకోట : ఈదురు గాలులకు విరిగిన, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేసి, విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించినట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ కె.రాజ్‌కుమార్ బుధవారం మీడియాకు తెలిపారు. మంగళవారం రాత్రి తీవ్రగాలులతో కురిసిన వర్షాలకు విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో మండలంలోని తాళ్లపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెం, తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి, సరఫరాకు అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. సంగతి తెలిసిందే. నూతలగుంటపాలెంలో 6, సోమవరంలో 2, జెట్టపురెడ్డితుని, ఏఎస్ పేట, అచ్చెర్లలో ఒక్కొక్కటి చొప్పున స్తంభాలు విరిగిపడినట్టు అధికారులు వెల్లడించారు. వీటిని యుద్ధప్రాతిపదికను పునరుద్ధరించామన్నారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాల్సి ఉందన్నారు. చింతలపాలెంలో మూడు హెచ్‌టీ లైన్ స్తంభాలతోపాటు, పలు గ్రామాల్లో సుమారు 20 వరకు వ్యవసాయ లైన్ విద్యుత్ స్తంభాలు విరిగినట్టు తెలిపారు. వీటిని త్వరిత గతిన పునరుద్ధరించి, గురువారంలోగా విద్యుత్ సరఫరాను అందించనున్నట్లు వెల్లడించారు.



విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలో సీతారాముల ఆలయ పునర్నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. సుమారు కోటి రూపాయిలతో కొత్త ఆలయ నిర్మాణం తలపెట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ బోకం సూర్య కుమారి రామానాయుడు దంపతులు, సర్పంచ్ బండారు మంగ,శ్రీనివాస్ దంపతులు ఇతర గ్రామ పెద్దలు హోమ గుండాల వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ఉంటేనే మానవులు హింసాయిత వాతావరణానికి దూరంగా ఉంటారన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ సూర్యకుమారి మాట్లాడుతూ 40 ఏళ్ల కిందట నిర్మించిన ఆలయం జీర్ణావస్థకు చేరడంతో పెద్దల నిర్ణయం మేరకు నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. సుమారు రూ.కోటితో ఇక్కడ ఆలయ పునర్నిర్మాణానికి సంకల్పించామని, భక్తులు గ్రామస్తులు సహకారంతో త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరాధ్యుల సీతారామాంజనేయ శాస్త్రి సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వేద పండితులు దుర్వాసుల రామశాస్త్రి, దుర్వాసుల ప్రదీప్ చంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో గుల్లేపల్లి సర్పంచ్ బండారు మంగ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరామ్, నాయకులు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, బ్యాంక్ మహేష్, యడ్ల నాయుడు, వనం అచ్చంనాయుడు, బోదువలస సర్పంచ్ బైలపూడి రామారావు, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గుల్లేపల్లిలో రామాలయ శంకుస్థాపనలో ఎమ్మెల్యే అదీప్ రాజ్

నేడు పడమటమ్మ ఆలయ ప్రారంభోత్సవం

కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో గురువారం ఉదయం 7.40 గంటలకు పడటమ్మ ఆలయ ప్రారంభోత్సవం జరగనుందని ఆలయ నిర్వాహకుడు పరవాడ రమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేయనున్నట్టు తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి సత్యవతి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.

12న పడమటమ్మ రాతి విగ్రహ ప్రతిష్టాపన

కశింకోట : మండలంలోని విసన్నపేటలో ఈ నెల 12న ఉదయం 7 గంటలకు పడమటమ్మ వారి రాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు బుధవారం మీడియాకు తెలిపారు. ఇప్పటి వరకు ఏడాకులమర్రిచెట్టు, అమ్మవారి విగ్రహానికి పూజలు జరుపుతున్నారు. తాజాగా స్థానికుడైన ఓ దాత ఆర్థిక సహాయంతో రాతి విగ్రహాన్ని తయారు చేసినట్టు తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఆలయ ఆవరణలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం

కశింకోట : కశింకోట ప్రాంతంలో బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో భారీ ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు సుమారు మూడు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని చాలా గ్రామాల్లో అంధకారం అలముకుంది. ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో విద్యుత్ పునరుద్ధరించడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.